www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 3 జనవరి 2023
5
అన్నమయ్య



త్వరలో జిఎస్‌టి సేవలు



జిఎస్‌టి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న స్వర్ణలత

ప్రజాశక్తి - రాయచోటి

త్వరలోనే వ్యాపారులందరికీ రాయచోటి పట్టణం నుంచే జిఎస్‌టి సేవలు అందిస్తామని ఎసిఎస్‌టిఎం స్వర్ణలత పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎన్ కాలనీలో ఏర్పాటు చేసిన అసిస్టెంట్ కమిషన్ సేల్‌టాక్స్ (జిఎస్‌టి) కార్యాలయాన్ని ఎసిటి నారాయణరెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని వ్యాపారులకు మరింత చేరువలో జిఎస్‌టి సేవలు అందనున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. ఆంజనేయులు, ఆడిటర్ మన్సూర్ అలీఖాన్, కృష్ణమోహన్‌రెడ్డి, కవిత, ఎఇఒ కరిముల్లా బాషా, ఆడిటర్లు రెడ్డిబాష, శివప్రసాద్, నాయక్, రైస్ అహ్మద్, చంద్రశేఖర్‌రాజు, జక్రియబాష పాల్గొన్నారు.

ఫేషియల్... అటెన్షన్!

16 నుంచి పంచాయతీల్లో అమలు
10.40 గంటల్లోపు హాజరు తప్పనిసరి



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఫేషియల్ రికగ్నైజేషన్ యాప్ నమోదు ప్రక్రియ అమల్లోకి వచ్చింది. 2023 నూతన సంవత్సరం ఒకటో తేదీ ఆదివారం కావడంతో సోమవారం నుంచి అమలుకు నోచుకుంది. జిల్లా కేంద్రాల్లో సుమారు ప్రధాన ప్రభుత్వ కార్యాలయ హెచ్‌ఒడిలు, ఇతర కింది స్థాయి ఉద్యోగులు 10.30 నుంచి 10.40 గంటల్లోపు తప్పనికి విధుల నిర్వహణ నిమిత్తం తమ కార్యాలయానికి చేరుకోవాలి. కార్యాలయ ఆవరణలోనికి వెళ్లిన వెంటనే జిపిఎస్ సిస్టమ్ పని చేయడం మొదలవుతుంది. అప్పటికే ఆన్‌లైన్ నుంచి ఉద్యోగుల మొబైల్‌ఫోన్‌లోకి డౌన్‌లోడ్ చేసు కున్న ఫేషియల్ రికగ్నైజేషన్ యాప్‌ను ఆపరేట్ చేయాల్సి ఉంది. అనంతరం ఉద్యోగుల పేరు, ఐడి టైప్ చేసిన వెంటనే యాప్ ఓపెన్ అవుతున్నట్లు తెలుస్తోంది. ఓపెన్ అయిన వెంటనే ఉద్యోగులు హాజ రు నమోదు చేసుకోవాల్సి ఉంది. లేనిపక్షంలో విధులకు గైర్హాజరైనట్లు భావించనుంది. ఆరోజు విధులకు సంబంధించిన వేతనం కట్ అవనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని ప్రధాన కార్యాలయాల హెచ్‌ఒడిలు ఫీల్డ్‌కు వెళ్లాల్సి వస్తే గంట ముందు యాప్‌కు సంబంధించిన ఫీల్డ్ ఆప్షన్‌ను ఓపెన్ చేసి ఫీల్డ్ వెళ్తున్న ఉద్దేశాన్ని నమోదు చేయాలి. అనంతరం ఫీల్డ్‌కు వెళ్లిన వెంటనే అక్కడి పరిసరాలతో కూడిన ఫొటోను అప్‌లోడ్ చేయా ల్సి ఉన్నట్లు తెలుస్తోంది.

16 నుంచి పంచాయతీల్లో!

ఈ నెల 16 నుంచి సంక్రాంతి పండుగ అనంతరం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పూర్తి స్థాయిలో అమల్లోకి రానుంది. కడప జిల్లాలో 557, అన్నమయ్య జిల్లాలో 501తో కలుపుకుని 1,058 పంచాయతీ కార్యాలయాల్లోనూ ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌లో ఉద్యోగులు హాజరును నమోదు చేసుకోవాల్సి ఉంది. జిల్లాలోని ప్రధాన కార్యాలయాల హెచ్ ఒడిలు రెండు నెలల కిందటి నుంచి ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌లో హాజరును నమోదు చేస్తున్నట్లు సమాచారం. గతంలో నుంచి ప్రభుత్వ ఉద్యోగులు ఇష్టాను సారంగా విధులకు హాజరు కావడంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో ఫేషియల్ రికగ్నిషన్ యాప్ నమోదు సాంకేతికతతో ఇటువంటి విమర్శలకు తెరపడనుంది.

ప్రభుత్వ ఉద్యోగుల్లో సనుగుడు

జిల్లాల్లోని ప్రభుత్వశాఖల పరిధిలోని వేలాది మంది ఉద్యోగులు ఉన్నట్లు అంచనా. జిల్లాలోని మూడు డివిజన్ల పరిధిలోని 1,058 పంచాయతీల్లోని సచివాలయాలు, పంచాయతీ కార్యాలయ ఉద్యోగులు ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌లో హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంది. జిల్లాలోని రిమోట్ పంచాయతీలు, సచివాలయాల్లో సంబంధించి నెట్ పని చేయని ప్రాంతాల ఉద్యోగుల పరిస్థితి ఏమిటనే వాదన వినిపిస్తోంది. ఏదేమైనా ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ప్రక్రియ పూర్తి స్థాయిలో అమలు కానుండడంతో ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కానుండడంతో పాలనా వ్యవహారాలు మెరుగపడే అవకాశం ఉందనే వాదన ఓ వైపు వినిపిస్తోంది. మరోవైపు జిల్లాలోని పలువురు ప్రభుత్వ ఉద్యోగుల్లో ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌లో హాజరు నమోదు చేయడంపై వ్యతిరేకత వ్యక్తమవుతుండడం గమనార్హం.

హెచ్‌ఒడిల పర్యవేక్షణ తప్పనిసరి : కలెక్టర్


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలోని వివిధ శాఖలలో ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ఆయా శాఖల హెచ్‌ఒడిల పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ సత్యనారాయణ, ల్యాండ్ అండ్ సర్వే ఎడి జయరాజు, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని హెచ్‌ఒడిలు తమ పరిధిలో జరిగే కార్యక్రమాలకు సంబంధించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండడంవల్ల కింది స్థాయి సిబ్బంది మరింత బాగా పనిచేసే అవకాశం ఉంటుందన్నారు.ప్రజలు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమానికి వస్తుంటారన్నారు. అధికారులు బాధితుల సమస్యలు గుర్తించి వెంటనే వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అర్జీదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులకు అర్థమయ్యే విధంగా పరిష్కార నివేదిక పంపాలన్నారు.సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను శనివారం లోపల క్లియర్ అయ్యేటట్లు చూడాలన్నారు.అర్జీదారుల సమస్యలను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, బాధితులు సంతృప్తిచెందేలా పరిష్కారం చూపాలన్నారు.స్పందన కార్యక్రమంలో ఎక్కువగా సివిల్ సప్లై, భూసమస్యలు, డిపిఒ, తదితర శాఖలకు సంబంధించిన సమస్యలు వస్తున్నాయని వీటిపై ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

అర్హులందరికీ పింఛన్లు : ఎమ్మెల్యే 'మేడా'


రాజంపేట: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అర్హులైన వారందరికీ పింఛన్లు అందించడం జరుగుతుందని, ప్రతిపక్షాలు చేసే ఆరోపణలు నిరాధారమైనవని రాజంపేట శాసనసభ్యులు మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వం పెంచిన పింఛన్లకు సంబంధించి పురపాలక కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకు 39 లక్షల మందికి మాత్రమే పింఛన్లు పంపిణీ చేస్తూ ఉండేవారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సంతృప్త స్థాయిలో అర్హులందరికి 100 శాతం పెన్షన్లు మంజూరు చేస్తూ 2019లో 52.17 లక్షలు, 2022లో 62.31 లక్షలు, 2023లో 64.06 లక్షల పెన్షన్లు మంజూరు చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని పేర్కొన్నారు. ప్రభుత్వంలో పింఛన్లు రెట్టింపు అయ్యాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ పెంపుదల చేసి మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని, రాష్ట్ర ప్రజల శ్రేయస్స జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** లబ్ధిదారులకు పింఛన్లను జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా, 14 వార్డు కౌన్సిలర్ షేక్ షబానతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు.కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **వీరబల్లి :** మండలంలోని సానిపాయిలో 13 మందికి పింఛన్లను సర్పంచ్ నేతి ఆంజనేయులు పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలు కాతీతంగా పింఛన్లను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలస్వామి, అగ్రికల్చల్ సరళ, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


విద్యార్థికి సర్టిఫికెట్ ఇస్తున్న సిఐ సుధాకర్‌రెడ్డి

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సిసి : సిఐ

ప్రజాశక్తి-రాయచోటి

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సిసి అని అర్బన్ సిఐ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నేతాజీ సర్కిల్ ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎన్‌సిసి విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్‌సిసి కోర్సు విద్యార్థులలో నైతిక విలువలను పెంపొందించడంతో పాటు దేశం పట్ల వారి బాధ్యతలను తెలియజేస్తుందని, విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థులలో క్రమశిక్షణను పెంపొందించి వారిని రేపటి సైనికులుగా, విద్యావేత్తలుగా, చక్కటి భావిభారత పౌరులుగా ఎదగటానికి ఎన్‌సిసి కోర్సు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనీ, కష్టపడి పనిచేసే తత్వాన్ని విద్యార్థులకు అలవాటు చేస్తుందని పేర్కొన్నారు. తదనంతరం ఎన్‌సిసి కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు 'ఎ' సర్టిఫికెట్లను ప్రదానం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. పిఆర్‌టియు రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్, జిల్లా అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్‌సిసి కోర్సు ఓవరం లాంటిదని క్రమశిక్షణ కలిగిన భావిభారత పౌరులను నిర్మించటములో ఎన్‌సిసి కోర్సు పాత్ర విశిష్టమైనదిగా పేర్కొన్నారు. విద్యార్థులను అనునిత్యం ప్రోత్సహిస్తూ ఉత్సాహపరిచే కోర్సు ఆఫీసర్ సేవలు మరిచిపోలేనివిగా పేర్కొన్నారు. ఎన్‌సిసి కోర్సు ఆఫీసర్ ఖాదర్‌బాషా మాట్లాడుతూ ఎన్‌సిసి కోర్సు విద్యార్థులకు ఎంతో విలువైనదని విద్య ఉపాధి రంగాల్లో ఒక శాతం రిజర్వేషన్లను అందజేయటమే కాక విద్యార్థుల్లో శారీరక మానసిక వికాసానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

చైతన్య సేవా సంస్థకు విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు పట్టణంలోని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలోని పిల్లలకు నూతన సంవత్సర కానుకగా విద్యా సామగ్రిని వితరణ చేశారు. సోమవారం టూ టౌన్ సిఐ మురళీకృష్ణ, ఎస్ఐ చంద్రమోహన్ చేతుల మీదుగా చిన్నారులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ జీవితంలో ఎటువంటి సమస్యలు ఎదురైనా, ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఏమి పట్టించుకోకుండా కేవలం చదువుపై మాత్రమే దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా మానసికంగా దృఢంగా స్థిరంగా కేవలం విద్యపైన దృష్టి సారించాలని భవిష్యత్తులో మన సమాజానికి మంచి పౌరులుగా మీరు సేవలు అందివ్వాలన్నారు. ఎంపీ ఆనందన్ మాట్లాడుతూ స్థిరమైన నిధులు లేకపోయినా దాతల సహాయ, సహకారాలతో ముందుకు నడుపుతున్నామని తెలిపారు. పోలీస్ శాఖ నుంచి ఈ పుస్తక వితరణ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వివిఎస్ ఆర్ గ్రూప్స్ అధినేత సుధాకర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రామ్మూర్తి, సంస్థ పాలనాధికారి డాక్టర్ జి.సుబ్రహ్మణ్యం బాబు, సంస్థ జనరల్ సెక్రెటరీ ఎ.కవితా రాణి, ముత్తు ఆంగ్ల మాధ్యం పాఠశాల ఉపాధ్యాయుల బృందం సుభాషిని, పుష్పవతి, రెడ్డి లక్ష్మి, పల్లవి, సురేంద్ర పాల్గొన్నారు. పోలీస్ సిబ్బందితో కలిసి వివేకానంద ఆశయం ఫౌండేషన్ భాను ప్రకాష్ బృందం పాల్గొన్నారు.



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న సిఐ, ఎస్ఐ

ఆంధ్ర జట్టు ఘన విజయం

ప్రజాశక్తి - కడప


తలపడుతున్న ఆంధ్ర-అరుణాచల్‌ప్రదేశ్ జట్లు

కడపలోని వై.ఎస్.రాజారెడ్డి ఎసిఎస్ స్టేడియంలో నిర్వహిస్తున్న సి.కె. నాయుడు ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో అరుణాచల్‌ప్రదేశ్ జట్టుపై ఇన్నింగ్స్ 111 పరుగుల తేడాతో ఆంధ్ర జట్టు ఘన విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్‌లో అరుణాచల్ ప్రదేశ్ జట్టు 40 పరుగులు చేసింది. 61 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 264 పరుగుల ఓవర్ నైట్ స్కోర్ తో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 79.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 369 పరుగులు చేసి డిక్లేర్ ప్రకటించింది. ఆంధ్ర జట్టులోని కే. మహిప్ కుమార్ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించాడు. 251 బంతులను ఎదుర్కొని 26 బౌండరీలు, 5 బౌండరీ సిక్సర్ల సహాయంతో 200 పరుగులు చేసి నాట్ అవుట్ గా నిలిచారు. అదే జట్టుకు చెందిన టి వంశీకృష్ణ 212 బంతులు ఎదుర్కొని 21 బౌండరీలు, 2 సిక్సర్ల సహాయంతో 157 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అరుణాచల్ ప్రదేశ్ జట్టు 72 ఓవర్లలో 218 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ చెట్టులోని నబం జోష్ 66, లిచ జాన్ 43 పరుగులు చేశారు. ఆంధ్ర జట్టులోని కే. మహిప్ కుమార్ 4, ఎం. ఆంజనేయులు 3 వికెట్లు తీసుకున్నారు. దీంతో ఆంధ్ర జట్టు ఇన్నింగ్స్ 111 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి 7 పాయింట్లు దక్కించుకుంది. ఓటమి చెందిన అరుణాచల్ ప్రదేశ్ కు పాయింట్లు ఏమీ లభించలేదు.

గొర్రెలపై చిరుత పులి దాడి

ప్రజాశక్తి - ముద్దనూరు

మేతకు వెళ్లి నీళ్లు తాగుతున్న గొర్రెల మందపై చిరుత పులి దాడి చేసింది. ఇందులో రెండు గొర్రెలు మృతిచెందాయి. సోమవారం డిప్యూటీ ఎఫ్ఆర్ఓ చంద్రశేఖర రావు వివరాల ప్రకారం మండలంలోని శెట్టి వారిపల్లె గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు గ్రామం నుంచి కొండపైకి గొర్రెల మందను మేపేందుకు అడవిలోకి వెళ్లారు. పూర్వం గ్రామం నుంచి కొండపైన ఉన్న కొట్టాలపల్లెకు వెళ్లేందుకు కాలి నడకన రస్తా ఏర్పాటు చేశారు. సోమవారం ఈ దారిలో గొర్రెల మందతో వెళుండగా అక్కడ ఉన్న నీటి కొలను వద్ద జీవాలు నీళ్లు తాగుతుండగా చిరుత పులి దాడి చేసి చంపింది. మరో 3 జీవాలు కనిపించలేదని గొర్రెల కాపరులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎఫ్ఆర్ఓ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. జీవాలపై చిరుత పులి కోరలు ఉన్నాయని తెలిపారు.కేసు నమోదు చేసి జీవాలను ఖననం చేయనున్నట్లు చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.


నీరజ


సాయి కుమారి


యువకృష్ణ

ఇంజినీరింగ్ ఫలితాల్లో 'సాయి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రాయచోటి

శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాల ప్రథమ సంవత్సరం రెండవ సెమిస్టర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక శాతం మార్కులు సాధించినట్లు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ సంవత్సర ఫలితాల్లో కూడా కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచి యూనివర్సిటీ పరిధిలో కళాశాలను అగ్రస్థానంలో నిలబెట్టారని తెలియజేస్తూ విద్యార్థులను కళాశాల అధ్యాపకులను అభినందించారు. ప్రథమ సంవత్సర రెండవ సెమిస్టర్ ఫలితాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో పి.యువకృష్ణ 89.79 శాతంతో మొదటి ర్యాంకు సాధించారని తెలిపారు. డి.సాయి కుమారి 89.27 శాతంతో రెండవ ర్యాంకు, టి.నీరజ 86.80 శాతంతో మూడవ ర్యాంకు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం నుంచి షేక్ రెడ్డి అబ్దుల్లా 84.78 శాతంతో మొదటి ర్యాంకు పి.అనిత 84.55 శాతంతో రెండవ ర్యాంకు, పి.యశ్వంత్ 84.44 శాతంతో మూడవ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ ఎన్.నాగేంద్ర కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి శుభహాన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి చంద్రశేఖర్ వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గిరీష, అధికారులు

పంట సాగుదారు హక్కు పత్రం పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - రాయచోటి

సోమవారం కలెక్టర్ గిరీష పిఎస్ కలెక్టరేట్లోని స్పందనహాల్లో పంట సాగుదారు హక్కుపత్రం(సిసిఆర్‌సి) పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు కల్పించే ప్రయోజనాలను సిసిఆర్‌సి పత్రం పొందే విధానం, యజమానులకు భరోసా మొదలైన విషయాలన్నీ పోస్టర్స్ ద్వారా ముద్రించి కౌలు రైతులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఈ పత్రం అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోని నోటీస్ బోర్డులలో ఏర్పాటు చేయించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులకు వైసిపి రైతు భరోసా కింద ప్రతి ఏడాది రూ.13,500 పెట్టుబడి సాయం ఇస్తారని తెలిపారు. పంట నష్టపరిహారం, ఉచిత పంటల బీమా, సున్నావడ్డీ పథకాల లబ్ధి, ప్రభుత్వం ద్వారా కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు, వ్యవసాయశాఖ ద్వారా రాయితీపై నాణ్యమైన విత్తనాలు, ఎరువులు వ్యవసాయ పనిముట్లు కౌలు రైతులకు ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ సత్యనారాయణ, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు, ల్యాండ్ అండ్ సర్వే ఏడి జయరాజు పాల్గొన్నారు.

యుటిఎఫ్ డైరీ, కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్/రాయచోటి టౌన్

2023 సంవత్సరం యుటిఎఫ్ డైరీ, కేలండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ డివిజన్ కన్వీనర్ సుధాకర్ మాట్లాడుతూఉపాధ్యాయులు సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ ఉపాధ్యాయుల సమస్యలే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు మహాదేవ, రవీంద్ర, గణేష్ కుమార్, భానుమూర్తి, రాము, సుధాకర్ నాయుడు పాల్గొన్నారు. **రూటా ఆధ్వర్యంలో...:** స్థానిక జిల్లా విద్యా కార్యాలయంలో రూటా కేలండర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి వై.రాఘవరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రూట జిల్లా జనరల్ సెక్రెటరీ శిబాతుర్ రెహామాన్, రాష్ట్ర ఫైనాన్స్ సెక్రెటరీ అసదుల్లా, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ అలీ, సికిందర్, ఆసిఫ్ హుమైద్దీన్, సజ్జాద్ ముహీబుల్లా, కరిముల్లా, సమీముల్లా పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి : ఎఎస్‌పి

రాయచోటి టౌన్ : జిల్లా పోలీసు కార్యాలయంలోని అదనపు ఎస్‌పి డాక్టర్ వివి.రాజ్‌కమల్ అధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 50 మంది ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో అదనపు ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులతో సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే చట్టపరిధిలో పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. భూ, సివిల్, కోర్టు పరిధిలోని వివాదాలలో న్యాయపరమైన సలహాలు పొంది తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగాదాల దరఖాస్తులు అందించారు. చట్టపరిధిలో సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు.


బాధిత మహిళతో మాట్లాడుతున్న ఎఎస్‌పి రాజకమల్

రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తం : మాజీ ఎమ్మెల్యే ఆర్ఆర్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అస్తవ్యస్తంగా మారిన రాష్ట్ర పాలన గాడిన పడాలంటే జగన్‌రెడ్డి పోవాలి చంద్రబాబు తిరిగి రావాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని 3,4 వార్డుల్లో టిడిపి ఆధ్వర్యంలో మన రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ రెడ్డి ఆయా అవార్డులలో ఇంటింటికి తిరుగుతూ వైసిపి అరాచక పాలన గురించి ప్రజలకు వివరించారు. అస్తవ్యస్తంగా ఉన్న రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రి కావాలని ,అందుకోసం ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అవినీతి, అరాచక, భూకబ్జాల పాలన సాగుతోందన్నారు. దీనికి తోడు రాష్ట్రంలో అన్ని రకాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, సామాన్యులు కనీసం నిత్యావసర సరుకులు కొనుక్కునే పరిస్థితులు కూడా లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వస్తే కులాలు చూడను,మతాలు చూడను,రాజకీయాలు చూడను అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు ఇస్తాను అని చెప్పి, నేడు భార్యా-భర్తల మధ్య, అత్తా-కోడళ్ళ మధ్య తగులు సృష్టిస్తూ నిర్ధాక్షణంగా వారికి నోటీసులు ఇస్తూ అనవసరమైన కారణాలతో పెన్షన్ తొలగించడానికి కంకణం కట్టుకున్నారని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో మహిళల పైన అఘాయిత్యాలుపెరిగిపోయాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అక్రమాలను, తప్పిదాలను, రైతులకు, సామాన్య ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులపై ఈ ప్రభుత్వం దాడులు చేయిస్తూ అక్రమంగా నిర్బంధిస్తూ తప్పుడు కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. రాయచోటి మున్సిపాలిటీలో ఎక్కడ చూసినా సిమెంట్ రోడ్లన్నీ గుంతల మయంగా మారాయని, డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండిపోయి కంపు కొడుతున్నాయని వాపోయారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు అల్లాడుతున్నారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడి,తెలుగుదేశం ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజలంతా సైనికుల్లా టిడిపికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్ వలీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఎస్.కె హుస్సేన్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు అతావుల్లా, టిడిపి నేతలు మన్సూర్, జావిద్, మైనుద్దీన్, జాబీర్, ఇంతియాజ్, మహమ్మద్ జాఫర్, మహబూబ్ బాషా, టీఎన్ఎస్ఎఫ్ సాయి ప్రతాప్, కలీం, అభూజర్, ఎద్దుల ప్రసాద్, షబ్బీర్, ముబారక్ మాజీ సర్పంచ్ జిలానీ బాష, శివారెడ్డి పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీదేవి రవికుమార్

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి- కలకడ

జగనన్న కాలనీ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ సూచించారు. సోమవారం మండలంలోని బాటవారిపల్లె పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న జగనన్న కాలనీ నిర్మాణాలను ఆమె తనిఖీలు చేశారు. జగనన్న కాలనీలో ఇంతవరకు నిర్మాణాలను చేపట్టని లబ్ధిదారులను పిలిపించి వారికి సూచనలు సలహాలు అందించారు. ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలను ఆలస్యం చేస్తే ఇళ్లను రద్దు చేయడం జరుగుతుందని అందుకోసం వెంటనే నిర్మాణాలను చేపట్టి పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. కొత్తపల్లిలోని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీలు చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా లేదా అని తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న వాలంటీర్

ప్రజాశక్తి-నిమ్మనపల్లి



మహిళకు పింఛను అందిస్తున్న వాలంటీర్

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ మహిళకు స్థానిక వాలంటీరు పింఛను అందించి మానవ త్వాన్ని చాటుకున్నారని ఎంపిడిఒ లీలామాధవి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలపరిధి అగ్రహారం పంచాయతీలోని మంచుకుంటపల్లెకు చెందిన నరసింహులు భార్య వసంత గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో తీవ్రంగా బాధపడు తున్నారని తెలిపారు. బెంగళూరులోని ఫోర్టిస్ ఆసుపత్రిలో గత రెండు నెలలుగా వారు అక్కడే ఉంటూ చికిత్స తీసుకుంటున్నారని తెలిపారు. ప్రభు త్వం డయాలసిస్ రోగులకు అందిస్తున్న 10 వేల రూపాయల పింఛనును గత రెండునెలల నుంచి స్థానిక వాలంటీర్ ఎస్.షఫీ బెంగళూరులోని ఆస్పత్రికి వెళ్లి ఆమెకు అందించినట్లు తెలిపారు. వాలంటీర్ ను ఎంపిడిఒ లీలా మాధవి, సర్పంచు ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి మంజుల, సచివాలయ ఉద్యోగులు జావిద్ భాషా, పవన్, ఆలం భాష, శ్రీలేఖ, లీలారాణి అభినందించారు.



కల్వర్టుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచు

కల్వర్టుల నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని వేములేటికోట పంచాయతీ పరిధిలోని బండ మీదపల్లి, ఓబిరెడ్డిగారి పల్లెల్లో కల్వర్టుల నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేములేటికోట సర్పంచ్ రవికుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఐసిఐసిఐ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో అన్ని మండలాల్లో వివిధ రకాలఅభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి సహాయ సహకారాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్ బాషా,సర్పంచ్ చంద్ర దేవేందర్ రెడ్డి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక



భరత్‌కుమార్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఎం.పి.భరత్ కుమార్ రాష్ట్రస్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సి పల్ డాక్టర్ ఎం.శీనునాయక్ పేర్కొన్నారు. ఈసందర్భంగా సోమ వారం ఆయన మాట్లాడుతూ భరత్ కుమార్ కబడ్డీ పోటీల్లో అద్భుతంగా రాణిస్తాడని, రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీ లకు ఎంపిక కావడమే ఆ విద్యార్థి ప్రతిభకు నిదర్శన మన్నారు. తమ పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. భవి ష్యత్తులో ఈ విద్యార్థి జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థి భరత్ కుమార్‌ను ప్రిన్సిపల్ ఎం.శీను నాయక్, పీడీ సుధీర్‌కుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే ఇకపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు స్థానిక ఎస్ఐ ఫాతిమా తెలిపారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మందుబాబులు రోడ్డు పక్కన, స్కూళ్లు, కాలేజీలు, జన సంచార ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమ్మనపల్లి చుట్టుప్రక్కల ప్రాంతాలైన స్కూళ్లు, కాలేజీలు , మార్కెట్ యార్డు తదితర ప్రాంతాలలో మద్యం సేవించడానికి అనువైన స్థలాలలోని గుబురు చెట్లను, నిమ్మనపల్లి మదనపల్లి రోడ్డులోనీ ప్రమాదకర మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్క లను గత రెండు రోజులుగా తొలగిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగా ప్రదేశంలో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విఆర్‌డిఎస్ సురేంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రతియేటా సంక్రాంతిని పురస్కరించుకుని క్రికెట్ ఆడే యువకులకు విఆర్‌డిఎస్ ఆధ్వర్యంలో క్రీడాసామగ్రి అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక శారీరక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం అధికంగా ఉంటుందని, వారి నైపుణ్యాలను బహిర్గతం చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో దాతలు కూడా క్రీడాకారులును ఆదుకోవ డానికి ముందుకు రావాలన్నారు. ఆయన వెంట తుమ్మల రమేష్, క్రీడాకారులు మస్తాన్, హరి, హరీష్ పాల్గొన్నారు.

'మాదకద్రవ్యాలతో భవిష్యత్తు ప్రశ్నార్థకమే'

ప్రజాశక్తి-కురబలకోట



మత్తుపదార్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఇబి అధికారి

విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిస అయితే భవిష్యత్తు ప్రశ్నార్థకమేనని ఎస్ఇబి అధికారులు రాధాకృష్ణ, మురళికిషోర్‌లు విద్యార్థులకు పిలుపునిచ్చారు. సోమవారం అంగల్లు సమీపంలోని గోల్డెన్‌వ్యాలీ కళాశాలలో విద్యార్థులకు మత్తుపదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నత భవిష్యత్తు ను ఎంచుకోవాలని అన్నారు. ప్రస్తుతం యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను ఛిద్రం చేసుకొంటున్నారని అన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ విద్యలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. గోల్డెన్‌వ్యాలీ కళాశాల కరెస్పాండెంట్ ఎన్‌వి. రమణారెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ కు, మద్యా నికి అలవాటు పడడంతో ఆరోగ్యం క్షీణించడంతో పాటు భవిష్యత్తు ప్రశ్నా ర్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండి భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో నిలిచి పలువురికి ఆదర్శంగా నిల వాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్. చంద్ర శేఖర్ రెడ్డి, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ వాసు, ప్రిన్సిపల్ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, డిప్లమా ప్రిన్సిపల్ ప్రవీణ, ఉంమి హెచ్ ఓ డి డాక్టర్ మీనాజ్ లతో పాటు అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ప్రజాశక్తి-యంత్రాగం

రాజంపేట అర్బన్ : మండల పరిధిలోని వైబియన్‌పల్లి గ్రామంలో ఉన్న అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం నందు వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకం, ఆకుపూజ నిర్వహించారు. ఆధ్యాత్మిక జీవనం వలన క్రమశిక్షణ గల జీవనం అలవడుతుందని తెలియజేశారు. **నందలూరు:** శ్రీ సౌమ్య నాథ స్వామి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షులు ఎద్దుల సుబ్బరాయుడు, కోశాధికారి చక్రాల రామసుబ్బన్నలు పెద్ద ఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి పర్వది నాన్ని పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు సౌమ్యనాథ స్వామిని దర్శించుకునేందుకు ఉత్తర ద్వారా దర్శనం చేసుకున్నారు. **కలకడ:** వైకుంఠ ఏకాదశి మండలంలోని భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు .స్థానిక దేవుళంపేటలో సిద్దేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, బిల్వార్చన, అర్చనలు నిర్వహించారు. గోపాలపురంలోని షిరిడి సాయిబాబా ఆలయంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అఖిలేష్, నాగయ్య గామస్తులు, మహిళలు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అగ్రహారంలోని కోదండ రామస్వామికి , నిమ్మనపల్లి లోని అభయాంజనేయస్వామి కి , మండ్యంవారి పల్లెలోని కోదండరామస్వామికి, తవలంలోని నేలమల్లేశ్వర స్వామి దేవాలయం నందు శివపార్వతులకు ప్రత్యేకపూజలు, అభిషేకాలు, చేశారు. **గాలివీడు :** మండలంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ఆలయ కమిటీ చైర్మన్ వెంకటరమణ, సిద్దయ్య, రమణ భజన కార్యక్రమాలు చేపట్టారు. **నిమ్మనపల్లి :** రాష్ట్ర ప్రజల కష్టాలు తీరాలని మదనపల్లి నియోజకవర్గ టిడిపి నాయకులు శ్రీరామనేని జయరాంనాయుడు అన్నారు. సోమవారం తవళం గ్రామంలో వెలసిన శ్రీ యోగ నేల మల్లేశ్వర స్వామి నీ వైకుంఠ ఏకాదశి సందర్భంగా దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. టిడిపి కార్యకర్తలు, నాయకులు కలసికట్టుగా టిడిపి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మేష రామకృష్ణ, పెంచుపాడు స్వామి, జివి రమణ, ముద్దు కృష్ణమ నాయుడు, బోనాల ఉమేష్, యుగంధర్, శివకుమార్ పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలో వైకుంఠ ఏకాదశి ఘనంగా నిర్వహించుకున్నారు.కోసవారిపల్లిలో ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో టిటిడి ఆధ్వర్యంలో వైకుంఠఏకాదశి ఘనంగా నిర్వహించారు. . భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. గ్రామస్తుల సహకారంతో వేలాది మంది భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ రెడ్డి భాస్కర్ పాల్గొన్నారు. **పీలేరు :** వైకుంఠ ఏకాదశి సందర్భంగా పీలేరులో వైష్ణవాలయాలు భక్తులతో కళకళలాడాయి. పీలేరు మండలంలోని పలు ఆలయాలు భక్తుల సందడితో కిటకిటలాడాయి. కోటపల్లెలోని శ్రీపద్మావతి ఆండాళ్ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోను, అలాగే కడప రోడ్డులోని వెంకటాద్రి ఇళ్ల సమీపంలో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, భక్తులకు వైకుంఠద్వార దర్శన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో కోటపల్లె ఆలయంలో మాజీ ఎమ్మెల్యే జివి.శ్రీనాథరెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, ఉమాకాంత రెడ్డి, నరసింహారెడ్డి, వెంకటేశ్వరస్వామి ఆలయంలో సూర్యనారాయణ రెడ్డి, రామకృష్ణా రెడ్డి, అన్నపూర్ణ క్యాటరింగ్ అధినేత చలపతి, నారాయణరెడ్డి, సభ్యులు రామ కృష్ణారెడ్డి, గంగిరెడ్డి, పలువురు భక్తులు, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు. **పెద్దమండ్యం :** వైకుంఠ ఏకాదశి రోజున మండలంలోని వైష్ణవ ఆలయంలో సోమవారం భక్తులతో కిటకిట లాడాయి. మండలంలోని పాపేపల్లి పంచాయతీ లోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ను,పెద్దమండ్యం లోనికోదండరామ అలయంలో నూచేరువుకిందపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలోస్వామివారి పుష్పాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వరదాచారులు స్వామి, మణికంఠ స్వామి పాల్గొన్నారు

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోండి



విద్యార్థికి ట్యాబ్‌ను అందిస్తున్న యోగేంద్ర

ప్రజాశక్తి-గుర్రంకొండ

ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని ఉన్నతచదువులకు బాటలు వేసుకోవాలని మండలప్రత్యేక ఆహ్వానితులు యోగేంద్ర, మండల కన్వీనర్ ముక్తియార్‌అలీఖాన్ పేర్కొన్నారు. సోమవారం గురుకులపాఠశాల, జడ్పి హైస్కూల్, ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మంచి స్థాయికి చేరుకోడానికి వారిలోని నైపుణ్యాన్ని వెలికి తీయాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జమీర్‌అలీఖాన్, హౌస్ ఫర్ చైర్మన్ నక్కగోపి, ఎంపిటిసి ఖదీర్ మాజీ ఎంపిపి నక్కచంద్రశేఖర్, గురుకులపాఠశాల ప్రిన్సిపల్, ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, ఎంఇఒ సురేంద్రబాబు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



104 సిబ్బందితో మాట్లాడుతూన్న డిప్యూటీ డిఎంహెచ్ఒ శాంతికళ

కుటుంబ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలను అందించాలని జమ్మలమడుగు డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ పేర్కొన్నారు. కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చెన్నమ్మరాజుపల్లెలో సోమవారం కుటుంబ డాక్టర్ విధానం ద్వారా అందిస్తున్న వైద్య, ఆరోగ్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. కుటుంబ డాక్టర్ విధానం ద్వారా 67 రకాల మందులను 14 రకాల పరీక్షలను ఉచితంగా అందిచాలన్నారు. గ్రామంలో ఉన్న బిపి, షుగర్, ఆస్తమా, రక్తహీనత, గుండె జబ్బులు, చిన్న చిన్న వ్యాధి గ్రస్తులు, గర్భిణులు, బాలింతలకు అందరికీ వైద్యం అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. గర్భిణులు, హైరిస్క్ గర్భిణులపై ఎక్కువ ప్రాధాన్యత చూపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలను చైతన్య పరచాలని కోరారు. వైద్యాధికారి హనీఫ్ బాబాతో ఇంత వరకు సాధించిన ప్రగతి నివేదిక తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 104 డాక్టర్ సుబ్రమణ్యం, సూపర్‌వైజర్ వరప్రసాద్, చంద్రకళ, సుబ్బయ్య, నాగ సుహాషిణి, ఆషా కార్యకర్త బిందు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం

ప్రజాశక్తి - ఖాజీపేట

ఈ ఏడాది అకాల వర్షాలతో దిగుబడులు ఒక్కో చోట ఒక్కో రకంగా వచ్చిందని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందేలా చర్యలు తీసుకుంటుందని వ్యవసాయాధికారులు తెలిపారు. మండల పరిధిలోని నాగసానిపల్లె రెవెన్యూ పొలాల్లో సోమవారం వ్యవ సాయశాఖ అధికారులు వరిలో పంట కోత ప్రయో గాలు చేపట్టారు. ఎఒ నాగార్చన, సచివాలయ వ్యవసాయ సహాయ అధికారి సురేంద్ర, బీమా సంస్థల ప్రతినిధి ప్రదీప్ పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని అధికారులు పేర్కొన్నారు.

ఐసిడిఎస్ సూపర్‌వైజర్లుగా ఉమారాణి, ప్రవీణ

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు ఐసిడిఎస్ ప్రాజెక్టుకు సంబంధించి ముద్దనూరు, యామవరం గ్రామ సెక్టార్లలోని అంగన్వాడీ కేంద్రాలకు ఉన్నతాధికారులు ఇద్దరు సూపర్‌వైజర్లను నియమించారు. ఆ మేరకు వారు సోమవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ ముంతాజ్ బేగం అధ్యక్షతన బాధ్యతలు స్వీకరించారు. ముద్దనూరు సెక్టార్ గ్రేడ్-2 సూపర్‌వైజర్‌గా ఉమారాణి, యామవరం సెక్టార్ గ్రేడ్-2 సూపర్‌వైజర్‌గా ప్రవీణ నియమితులయ్యారు. ఉమారాణి నంద్యాల జిల్లా నందికొట్కూర్ ప్రాజెక్టు పరిధిలోని పాములూరు మండలంలో అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ప్రవీణ ప్రొద్దుటూరు అర్బన్‌లో కార్యకర్తగా విధులు నిర్వహిస్తూ పదోన్నతితో మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలు, గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్‌టియు కేలండర్ ఆవిష్కరణ

ఖాజీపేట : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎస్‌టియు కేలండర్‌ను సోమవారం తహశీల్దార్ పి.రమణారెడ్డి ఆవిష్కరించారు. ఎస్‌టియు మండల శాఖ అధ్యక్షుడు జి.రామమోహన్, ప్రధాన కార్యదర్శి పి.ఓబన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్‌టియు కడప రీజియన్ కో-కన్వీనర్ ఎస్.కరిముల్లా, జిల్లా కౌన్సిలర్లు శ్రీనివాసులు, వీర ప్రతాప్, మండల మహిళా కన్వీనర్ సి.పద్మ, సిపిఎస్ కన్వీనర్ ఎన్.సుమన్, మండల యూనియన్ నాయకులు జి.వెంకటసుబ్బారెడ్డి, జి.సుబ్బారెడ్డి, నాగరాజు, విజయకుమార్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ప్రతి ఏడాదీ చేతనైన సాయం చేస్తాం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక వృద్ధాశ్రమంలో మానసిక వికలాంగులకు, వృద్ధులకు టిడిపి పట్టణ మాజీ అధ్యక్షులు మద్దూరు వెంకటరామిరెడ్డి తన పెద్ద కుమార్తె రాధా కుమారి, అల్లుడు జయ చంద్రారెడ్డి వివాహ వార్షికో త్సవ సందర్భంగా అన్న దానం చేశారు. మరికొన్ని వస్తువులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఇదే రోజు చేతనైన సాయం చేస్తుంటామని తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

వైసిపి ప్రభుత్వంలో అర్హతగల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బి. కొత్తపల్లి గ్రామ పం చాయతీలో సోమవారం కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచు సుబ్బమ్మ, పంచాయతీ కన్వీనర్లు జి.నాగిరెడ్డి, గాజులపల్లె రామ సుబ్బారెడ్డి, కొండా లక్ష్మీదేవి లబ్ధిదారులకు అంద జేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ కొత్తపల్లి పంచాయతీలో ఇంతకు మునుపు 285 పింఛన్లు ఉండేవని, ఇందలో ఏ ఒక్కటి కూడా తొల గించలేదన్నారు. కొత్తగా 11 పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - మైదుకూరు

మండలంలోని లెక్కలవారిపల్లె గ్రామానికి చెందిన లెక్కల శ్రీనివాసులరెడ్డి (55) అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు ఒక కుమారుడు. కుమార్తె ఉన్నారు. శ్రీనివాసులరెడ్డి కడపలో నివాసంఉంటున్నారు. చిట్వేలి మండలం నాగవరంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు రైలు ఎక్కేందుకు బైకుపై వెళుతుండగా అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి, బైక్ నుంచి కింద పడి మృతి చెందారు. తోటి ఉపాధ్యాయులు రైలు సమయం అవుతున్నా ఇంకా రాలేదని గుర్తించి ఫోన్ చేయగా, ఆయన చనిపోయిన విషయం తెలిసింది. వెంటనే వారు ఆయన బంధువులకు సమాచారమిచ్చారు.

విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి

పులివెందుల టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేకదృష్టి పెట్టారని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. పాడా నిధుల ద్వారా రంగనాథస్వామి గుడి ప్రాంగణంలో వైఎస్ఆర్ వాటర్ ప్లాంట్‌ను వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పులివెందుల ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి ఎన్నో నిధులిచ్చారని తెలిపారు. పులివెందుల నియోజకవర్గం అదర్శవంతంగా ఉండేదుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయాల చైర్మన్లు, సుధీకర్‌రెడ్డి, బ్యాటరీ ప్రసాద్, యర్వ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇక్బాల్ అహ్మద్

మైనార్టీల అభివృద్ధే వైసిపి లక్ష్యం

మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్

ప్రజాశక్తి-కలికిరి

ముస్లిం మైనార్టీల అభివృద్దే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం ముందుకు వెళుతుందని రాష్ట్ర ముస్లిం మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో పట్టణంలోని ముస్లిం మైనార్టీలతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మసీదుల అభివృద్ధి కోసం ఎంపీ నిధులు కింద రూ.43 లక్షల రూపాయలు నిధులు విడుదల య్యాయని అన్నారు. ఈ నిధులతో పట్టణంలో ఉన్న మసీదుల మౌలిక వసతులు మెరుగు పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్‌కుమార్‌రెడ్డి, ఎంపిపి నూర్జహాన్, మండల కో-ఆప్షన్ మెంబర్ రిజ్వాన్, వైసిపినాయకులు ఆగా మొహిద్దిన్, బాలాజీ పాల్గొన్నారు.

7న కె.సి.అగ్రహారంలో క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

మండలంలోని రెడ్డివారిపల్లె గ్రామపంచాయతీ కెసి అగ్రహారం నందు ఈనెల 7వ తేదీన కెసి అగ్రహారం ప్రీమియర్ క్రికెట్‌లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రామిరెడ్డి రాజకుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రికెట్ పోటీలలో పాల్గొనదలచినవారు ఈనెల 5వ తేదీ లోపు రూ.999 రూపాయలు ఎంట్రీ ఫీజు చెల్లించి నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా 50వేల రూపాయలు,రెండవ బహుమతిగా 25వేల రూపాయలను మండల వైస్ ఎంపిపి రామిరెడ్డి ద్వజారెడ్డి అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనేవారు 7893656408 నంబరును సంప్రదించాలని తెలిపారు.

పేదలకు అండగా సిఎం జగన్ : ఎంపిపి

ప్రజాశక్తి-గాలివీడు

కులమత అని భేదం లేకుండా ప్రజలందరినీ సంతోషపెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎంపిపి జల్లా సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎంపిడిఒ ప్రాంగణంలో ఎంపిడిఒ శేఖర్ నాయక్ అధ్యక్షతన వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద పెంచిన పెన్షన్ ను లబ్ధిదారులకు అందజేశారు. 228 మందికి కొంత పింఛన్లు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో తాగునీరు, సాగునీరు సమస్య లేకుండా చేస్తున్నారని అన్నారు. మండలంలో 16 గ్రామ సచివాలల్లో 7143 కొత్త పింఛన్లను వాలంటీర్ల ద్వారా పింఛన్లను పంపిణీ చేశామని తెలిపారు. ఎంపిడిఒ శేఖర్‌నాయక్ మాట్లాడుతూ 198 పింఛన్లు అనర్హులుగా ఉంటే వాటిని సరిచేసి ఒక పింఛను కూడా తొలగించకుండ అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు గాలి శ్రీనివాసులు, చంద్రారెడ్డి, చిన్న రెడ్డి, బాను సర్పంచులు వెలిగల్లు, గోరాన్‌చెర్వు, గుండ్లచెరువు, సిసిపల్లె సెక్రెటరీలు డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.**బి.కొత్తకోట :** 2023 జనవరి నుండి రూ.250 పెంచి రూ.2750 చొప్పున లబ్ధిదారులకు వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం జరిగింది. సోమవారం పట్టణంలోని 5వవార్డు సచివాలయం పరిధిలోని లబ్ధిదారులందరికి కన్వీనర్ శెట్టిపల్లి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పెన్షన్లను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. సకాలం లో సంక్షేమ పథకాలు, భరోసా పెన్షన్లు సక్రమంగా అందిస్తున్నామని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పెన్షనర్లుకు భరోసా కల్పించి సకాలంలో ఇంటి వద్దనే అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని కొనియాడారు.కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఇఒ

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంఇఒ రాజగోపాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమ్మనపల్లి పంచాయతీ గండిమాలపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని పకడ్బందీగా నిర్వహి స్తున్నామని అన్నారు. ప్రతిరోజు మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ బడుల్లో విద్యతోపాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఉపాధ్యాయులు, నిర్వాహకులు పని చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఇద్దరి యువకుల పరిస్థితి విషమం

ప్రజాశక్తి-గుర్రంకొండ



మృతి చెందిన అబ్దుల్ అజీజ్

గుర్రంకొండ సమీపంలో ఉన్న రెడ్డికోట వద్ద ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని కడపకు చెందిన అబ్దుల్ అజీజ్ (33) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన కడపకు చెందిన అయూబ్, గుర్రంకొండకు చెందిన అబ్దుల్‌హమీద్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని హుటాహుటిన 108 సిబ్బంది మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు క్షతగాత్రులకు ప్రథమచికిత్స అందించి, వారిఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుమగైన వైద్యంకోసం వెంటనే తిరుపతికి వెళ్లాలని సూచించారు. కుటుంబ సభ్యులు బాధితులను చికిత్సల నిమిత్తం హుటాహుటిన తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ రామకృష్ణారెడ్డి, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చ్యూరికి తరలించారు. ఘటనపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

బాలిక కిడ్నాప్ కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఫాతిమా తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో 124/2022 నెంబర్ తో నమోదైన కేసులో నిందితుడిగా ఉన్న నిమ్మనపల్లి పంచాయతీ గూడుపల్లెకు చెందిన గెరివివెంకటేష్ ను చల్లావారిపల్లి క్రాస్ వద్ద సోమవారం అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. వెంగంవారిపల్లి పంచా యతీ కొత్తకొండసానివారిపల్లెలో నివాసమున్న బత్తల అక్కులమ్మ మనవరాలైన బాలిక గత నెల 23 నుంచి కనిపించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసుగా నమోదుచేసి దర్యాప్తు అనంతరం పోలీసులు కిడ్నాప్ కేసుగా మార్చారు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 3 జనవరి 2023






దేవునికడప వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

ఫేషియల్... అటెన్షన్!

16 నుంచి పంచాయతీల్లో అమలు
10.40 గంటల్లోపు హాజరు తప్పనిసరి



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఫేషియల్ రికగ్నైజేషన్ యాప్ నమోదు ప్రక్రియ అమల్లోకి వచ్చింది. 2023 నూతన సంవత్సరం ఒకటో తేదీ ఆదివారం కావడంతో సోమవారం నుంచి అమలుకు నోచుకుంది. జిల్లా కేంద్రాల్లో సుమారు ప్రధాన ప్రభుత్వ కార్యాలయ హెచ్ఒడిలు, ఇతర కింది స్థాయి ఉద్యోగులు 10.30 నుంచి 10.40 గంటల్లోపు తప్పనికి విధుల నిర్వహణ నిమిత్తం తమ కార్యాలయానికి చేరుకోవాలి. కార్యాలయ ఆవరణలోనికి వెళ్లిన వెంటనే జిపిఎస్ సిస్టమ్ పని చేయడం మొదలవుతుంది. అప్పటికే ఆన్‌లైన్ నుంచి ఉద్యోగుల మొబైల్‌ఫోన్‌లోకి డౌన్‌లోడ్ చేసు కున్న ఫేషియల్ రికగ్నైజేషన్ యాప్‌ను ఆపరేట్ చేయాల్సి ఉంది. అనంతరం ఉద్యోగుల పేరు, ఐడి టైప్ చేసిన వెంటనే యాప్ ఓపెన్ అవుతున్నట్లు తెలుస్తోంది. ఓపెన్ అయిన వెంటనే ఉద్యోగులు హాజ రు నమోదు చేసుకోవాల్సి ఉంది. లేనిపక్షంలో విధులకు గైర్హాజరైనట్లు భావించనుంది. ఆరోజు విధులకు సంబంధించిన వేతనం కట్ అవనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని ప్రధాన కార్యాలయాల హెచ్ఒడిలు ఫీల్డ్‌కు వెళ్లాల్సి వస్తే గంట ముందు యాప్‌కు సంబంధించిన ఫీల్డ్ ఆప్షన్‌ను ఓపెన్ చేసి ఫీల్డ్ వెళ్తున్న ఉద్దేశాన్ని నమోదు చేయాలి. అనంతరం ఫీల్డ్‌కు వెళ్లిన వెంటనే అక్కడి పరిసరాలతో కూడిన ఫొటోను అప్‌లోడ్ చేయా ల్సి ఉన్నట్లు తెలుస్తోంది.

16 నుంచి పంచాయతీల్లో!

ఈ నెల 16 నుంచి సంక్రాంతి పండుగ అనంతరం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పూర్తి స్థాయిలో అమల్లోకి రానుంది. కడప జిల్లాలో 557, అన్నమయ్య జిల్లాలో 501తో కలుపుకుని 1,058 పంచాయతీ కార్యాలయాల్లోనూ ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌లో ఉద్యోగులు హాజరును నమోదు చేసుకోవాల్సి ఉంది. జిల్లాలోని ప్రధాన కార్యాలయాల హెచ్ఒడిలు రెండు నెలల కిందటి నుంచి ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌లో హాజరును నమోదు చేస్తున్నట్లు సమాచారం. గతంలో నుంచి ప్రభుత్వ ఉద్యోగులు ఇష్టాను సారంగా విధులకు హాజరు కావడంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో ఫేషియల్ రికగ్నిషన్ యాప్ నమోదు సాంకేతికతతో ఇటువంటి విమర్శలకు తెరపడనుంది.

ప్రభుత్వ ఉద్యోగుల్లో సనుగుడు

జిల్లాల్లోని ప్రభుత్వశాఖల పరిధిలోని వేలాది మంది ఉద్యోగులు ఉన్నట్లు అంచనా. జిల్లాలోని మూడు డివిజన్ల పరిధిలోని 1,058 పంచాయతీల్లోని సచివాలయాలు, పంచాయతీ కార్యాలయ ఉద్యోగులు ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌లో హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంది. జిల్లాలోని రిమోట్ పంచాయతీలు, సచివాలయాల్లో సంబంధించి నెట్ పని చేయని ప్రాంతాల ఉద్యోగుల పరిస్థితి ఏమిటనే వాదన వినిపిస్తోంది. ఏదేమైనా ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ప్రక్రియ పూర్తి స్థాయిలో అమలు కానుండడంతో ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కానుండడంతో పాలనా వ్యవహారాలు మెరుగపడే అవకాశం ఉందనే వాదన ఓ వైపు వినిపిస్తోంది. మరోవైపు జిల్లాలోని పలువురు ప్రభుత్వ ఉద్యోగుల్లో ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌లో హాజరు నమోదు చేయడంపై వ్యతిరేకత వ్యక్తమవుతుండడం గమనార్హం.

గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయండి

కలెక్టర్ వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ రామరాజు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న గృహ నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సభాభవన్‌లో మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, ఆర్‌డిఒ గంగాధర్ గౌడ్, హౌసింగ్ పీడీ కృష్ణయ్యతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, ప్రాధాన్యత భవన నిర్మాణాల అభివృద్ధి పనులు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని చెప్పారు. ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని లే అవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిని ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. లే అవుట్ పూర్తయినవి, గ్రౌండింగ్ స్టార్ట్ అయినవి, మేస్త్రీలతో టై అప్, ఇసుక, బరస్, సిమెంట్ మొదలైన మెటీరియల్, ఫైనాన్స్ అసిస్టెన్స్ మొదలైన అన్ని రకాల సదుపాయాలను సమకూర్చి, నిర్మాణ పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న గృహనిర్మాణాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వక పూర్తి అవగాహనతో లక్ష్యాలను అధిగమించాలని అన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, వెనకబడితే చర్యలు తప్పవని అన్నారు. గృహ నిర్మాణ శాఖ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో రోజూ సమీక్ష చేయాలన్నారు. జగనన్న కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థపై క్షేత్ర స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసుకొని నివేదికను పంపాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో, హౌసింగ్, అనుబంధ శాఖల అధికారులైన నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

ఖైదీల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం



స్టోర్‌రూమ్ పరిశీలిస్తున్న జడ్జి

కడప : మానసిక వ్యాధి ఖైదీల ఆరోగ్య విషయాల పట్ల డాక్టర్లు ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటూ ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత ఆదేశించారు. సోమవారం జడ్జి పురుషుల, మహిళల కారాగారాలను సందర్శించారు. అక్కడలీగల్ ఎయిడ్ క్లినిక్, న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖైదీల కుటుంబ సభ్యులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేందుకు న్యాయ సలహాలు, సహాయం అంది ఎడం లాంటి విషయాలను వివరించారు. జైలు పరిసరాలను జడ్జి పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు, కేంద్రకారాగారంలో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను విజిట్ చేసి లీగల్ ఎయిడ్ క్లినిక్ విధివిధానాలు తెలియజేశారు. కార్యక్రమంలో పురుషుల మరియు మహిళల కేంద్ర కారాగార డిప్యూటీ సూపర్డెంట్లు, జైలర్లు, డాక్టర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

గొర్రెలపై చిరుత పులి దాడి

ప్రజాశక్తి - ముద్దనూరు



చిరుత దాడిలో మృతి చెందిన గొర్రెలు

మేతకు వెళ్లి నీళ్లు తాగుతున్న గొర్రెల మందపై చిరుత పులి దాడి చేసింది. ఇందులో రెండు గొర్రెలు మృతి చెందాయి. సోమవారం డిప్యూటీ ఎఫ్ఆర్ఓ చంద్రశేఖరరావు వివరాల ప్రకారం మండలంలోని శెట్టి వారిపల్లె గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు గ్రామం నుంచి కొండపైకి గొర్రెల మందను మేపేందుకు అడవిలోకి వెళ్లారు. పూర్వం గ్రామం నుంచి కొండపైన ఉన్న కోట్లలపల్లెకు వెళ్లేందుకు కాలి నడక రస్తా ఏర్పాటు చేశారు. సోమవారం ఈ దారిలో గొర్రెల మందతో వెళ్తుండగా అక్కడ ఉన్న నీటి కొలను వద్ద జీవాలు నీళ్లు తాగుతుండగా చిరుత పులి దాడి చేసి చంపింది. మరో 3 జీవాలు కనిపించలేదని గొర్రెల కాపరులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎఫ్ఆర్ఒ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. .జీవాలపై చిరుత పులి కోరలు ఉన్నాయని తెలిపారు.కేసు నమోదు చేసి జీవాలను ఖననం చేయనున్నట్లు చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.



రూట కేలండర్ ఆవిష్కరణ డిప్యూటీ సిఎం అంజాద్‌బాష



రిమ్స్‌లో ఎన్‌జిఒ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

'రూట' కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) ఆధ్వర్యంలో ముద్రించిను క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ బి అంజాద్ బాష, రూట రాష్ట్ర వ్యస్థాపక అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, డైరీ క్యాలండర్ కమిటీ చైర్మన్ హాజి అబ్దుల్ హకీమ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర కార్పొరేటర్లు అజ్మతుల్లా ఖాన్ , కమాల్ బాషా, జీలాన్ , ఎన్ఆర్ఐ ఇలియాస్, రూట రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు షాహిదుల్లా, సత్తార్ ఫైజి, డైరీ కమిటీ కో చైర్మన్ సయ్యద్ సిరాజుద్దిన్, సమన్వయకర్త ముహమ్మద్ అయ్యూబ్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బేపారి ఫకృద్దిన్, రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్ బాషా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముహమ్మద్ ఇర్షాద్, జాకిర్ హుసేన్ పాల్గొన్నారు. **ఎన్‌జిఒ కేలండర్ ఆవిష్కరణ ..** కడప నగర శివారులోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (రిమ్స్) లో ఎన్జీఓ-2023 కేలండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ముఖ్యతిధులుగా ఆస్పత్రి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డి.రవి కుమార్ హాజరై ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నగర ట్రేషరర్ బి.వెంగళరావు, ప్రభుకర్ అసోసియేషన్ మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు. **ఎపిటిఎఫ్ డైరీ ఆవిష్కరణ**..ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరే షన్(ఎపిటిఎఫ్ 257) డైరీ, కేలండర్, జీవోల సంపుటిని పాఠశాల విద్య సం యుక్త సంచాలకులు ఎం.వెంకటకృష్ణారెడ్డి, డిఇఒ దేవరాజు ఆర్జేడి కార్యాల యంలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలోఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్ సుందర్ రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు ఖాదర్‌బాష, గురయ్య, కడప మండల అధ్యక్షుడు ప్రసాద్, చింత కొమ్మదిన్నె మండల అధ్యక్ష, కార్యదర్శులు రామ చంద్రారెడ్డి, రమణ పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** ఉపాధ్యాయ రంగంలో యుటిఎఫ్ సేవలు ఎనలేనివి అని మండల విద్యాశాఖ అధికారి రఘురామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయం త్రం మండల విద్యాశాఖ కార్యాలయంలో 2023 యుటిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు జోజయ్య, చెన్న య్య, రాఘవేంద్ర మండల అధ్యక్షులు కృష్ణయ్య, భాస్కర్ రెడ్డి కార్యదర్శులు నాయబ్ రసూల్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

అవ్వా, తాతల ముఖంలో చిరునవ్వే ధ్యేయం

కడప అర్బన్ : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అవ్వా తాతల ముఖంలో చిరునవ్వులే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. సోమవారం 11వ డివిజన్ పరిధి మృత్యుంజయ కుంట శివాలయం వద్ద కార్పొరేటర్ శ్రీ లలిత, ఇన్‌చార్జ్ కె. విజయభాస్కర్ వర్మ, 27 వ డివిజన్ పరిధి గౌస్ నగర్ అమీర్ హాల్ వద్ద కార్పొరేటర్ జహీర్, 37 వ డివిజన్ పరిధి అగాడి వీధిలో కార్పొరేటర్ సమ్మెట వాణి, ఇన్‌ఛార్జి బసవరాజు, 40వ డివిజన్ పరిధి బిల్టప్ వద్ద కార్పొరేటర్ బాల స్వామి రెడ్డి ఆధ్వర్యంలో పలు ప్రాంతాలలో వైయస్సార్ పింఛన్ కానుక కార్యక్రమాన్ని నిర్వహించి లబ్ధిదారులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజద్ బాష చేతుల మీదుగా పెన్షన్ మొత్తాన్ని పంపిణీ చేశారు.

అధ్యాపకుడికి పిహెచ్‌డి ప్రదానం

కడప అర్బన్ : కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో సంయుక్త ఆచార్యులుగా పనిచేస్తున్న మొహమ్మద్ మహబూబ్ పాషాకు కెఎల్ విశ్వవిద్యాలయం కేఎల్ విశ్వవిద్యాలయం (విజయవాడ) పిహెచ్‌డి ప్రదానం చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విఎస్ఎస్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో కెఎల్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వెంకట సుబ్బారావు పర్యవేక్షణలో కంప్రెస్డ్ థర్మల్ వేవ్ డిటెక్షన్, రేంజింగ్ ఫర్ సబ్ సర్ఫేస్ అనాలసిస్ ఆఫ్ సాలిడ్స్ అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను పీ హెచ్ డీ డిగ్రీ పట్టాను ప్రదానం చేశారని పేర్కొన్నారు. పి హెచ్ డీ డిగ్రీ పట్టాను పొందడం పట్ల కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), ఈసీఈ విభాగాధిపతులు డాక్టర్ జి. హేమలత, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలి

కడప అర్బన్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అట్లూరు మండల వాట్సాప్ గ్రూప్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన రొండ్లా మనోహర్ రెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని రాష్ట్ర మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షురాలు కొటపాటి సుబ్బమ్మ, ఎంఎస్‌పి జిల్లా నాయకులు మాతయ్య, జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అదనపు కార్యదర్శి పి. కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగంగా క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాలమహానాడు జిల్లా అధ్యక్షురాలు జోష్న, దళిత ప్రజావేదిక జిల్లా నాయకులు ఓబులపతి, చిన్న సుబ్బయ్య యాదవ్, జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి కడప జిల్లా అధ్యక్షుడు నరసింహులు, దళిత విద్యార్థి సంఘ నాయకులు జయవర్ధన్, నాగేంద్ర, శంకర్ పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబాన్ని ఆదుకోవాలి

కడప అర్బన్ : చెన్నూరులో సంధ్య అనే అంగన్వాడీ కార్యకర్త మృతిచెందారని, ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. లక్ష్మీదేవి, జిల్లా అధ్యక్షులు ఆర్. లక్ష్మీదేవి, జిల్లా కోశాధికారి అంజనిదేవి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్వాడీ కార్యకర్తల పట్ల రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడి పెరిగిందని పేర్కొన్నారు. తక్షణమే అంగనాకవడీ వర్కర్ కుటుంబాన్ని ఆదుకోవాలని తెలిపారు.

ఆంధ్ర జట్టు ఘన విజయం



తలపడుతున్న ఆంధ్ర- అరుణాచల్ ప్రదేశ్ జట్లు

కడప : కడపలోని వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎస్ స్టేడి యంలో నిర్వహిస్తున్న సి.కె. నాయుడు ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో అరుణాచల్ ప్రదేశ్ జట్టుపై ఇన్నింగ్స్ 111 పరుగుల తేడాతో ఆంధ్ర జట్టు ఘన విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్‌లో అరుణాచల్ ప్రదేశ్ జట్టు 40 పరుగులు చేసింది. 61 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 264 పరుగుల ఓవర్ నైట్ స్కోర్ తో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 79.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 369 పరుగులు చేసి డిక్లేర్ ప్రకటించింది. ఆంధ్ర జట్టులోని కే. మహిప్ కుమార్ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించాడు. 251 బంతులను ఎదుర్కొని 26 బౌండరీలు, 5 బౌండరీ సిక్సర్ల సహాయంతో 200 పరుగులు చేసి నాట్ అవుట్ గా నిలిచారు. అదే జట్టుకు చెందిన టి వంశీకృష్ణ 212 బంతులు ఎదుర్కొని 21 బౌండరీలు, 2 సిక్సర్ల సహాయంతో 157 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అరుణాచల్ ప్రదేశ్ జట్టు 72 ఓవర్లలో 218 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ చెట్టులోని నబం జోష్ 66, లిచ జాన్ 43 పరుగులు చేశారు. ఆంధ్ర జట్టులోని కే. మహిప్ కుమార్ 4, ఎం. ఆంజనేయులు 3 వికెట్లు తీసుకున్నారు. దీంతో ఆంధ్ర జట్టు ఇన్నింగ్స్ 111 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి 7 పాయింట్లు దక్కించుకుంది.

11న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాక

కడప : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఈనెల 11న కడపకు వస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనతోపాటు ఎఐసిసి కార్యదర్శి మెయ్యప్పన్, పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతం హాజరు అవుతున్నట్లు తెలిపారు.

ఆక్రమణలను తొలగించాలి

కడప : బుగ్గ వంకలోనికి మురుగు, వర్షపు నీరు వెళ్లే ప్రధాన కాల్వపైన విజేత హోటల్, అరుణ లాడ్జిని అక్రమంగా ఏర్పాటు చేశారని వెంటనే తొలగించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎ. సత్తార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కలెక్టర్ విజయ్‌రామరాజుకు స్పందనలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్తార్ మాట్లాడుతూ ఆక్రమణ విషయమై మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. కమిషనర్‌కు కూడా తప్పుడు సర్వే రిపోర్ట్ ఇచ్చారు అన్నారు. స్పందించిన కలెక్టర్ ఆక్రమణలపై వెంటనే తగు చర్యలు తీసుకుంటామని, తొలగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో షకీల్, రఫీ, బాబు, అబూ సలీం పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

కడప : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సోమవారం కడపలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో 26 బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కమలాపురం నియోజకవర్గానికి చెందిన ఆరు మండలాలలోని 26 బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 17 లక్షల 14 వేల రూపాయలు చెక్కులను అందజేశారు.

నేడు ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

కడప అర్బన్ : నగరంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఉన్న మాతృశ్రీ ఐవిఎఫ్ క్లినిక్‌లో మంగళవారం ఉచిత సంతాన సాఫల్య సలహా చికిత్సా శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఇన్ ఫెర్టిలిటి స్పెషలిస్ట్ డాక్టర్ వై. ప్రమోద తెలిపారు. సోమవారం సురక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మంగళవారమూ మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు సంతానం లేమి సమస్యతో బాధపడే దంపతులకు శిబిరం ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. శిబిరానికి భార్యాభర్తలు ఇద్దరు కలిసి రావాలన్నారు. ఉచిత డాక్టర్ కన్సల్టేషన్‌తో పాటు మహిళలకు స్కానింగ్, పురుషులకు సెమెన్ అనాలసిస్ ఉచితంగా నిర్వహిస్తామన్నారు. అపాయింట్‌మెంట్ కోసం 7995629110లో సంప్రదించాలని కోరారు.

ఉన్నత పాఠశాలకు ట్రాలీ స్పీకర్ వితరణ



స్పీకర్, కుర్చీలు అందజేస్తున్న పూర్వ విద్యార్థి

వల్లూరు : మండల పరిధిలోని గంగాయపల్లి ఉన్నత పాఠశాల పదోతరగతి పూర్వపు (1974) విద్యార్థి వంకదారి పంకజ కుమారి ట్రాలీ స్పీకర్ పాఠశాలకు సోమవారం వితరణ చేశారు. సుమారు రూ. 25 వేలు విలువ చేసే స్పీకర్, కుర్చీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ నాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయు లుమాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. ట్రాలీ స్పీకర్, కుర్చీలు అందించడం చాలా ఆనందంగా ఉందని పూర్వపు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

కోదండరాముడికి భక్తుల తాకిడి


ఒంటిమిట్ట : ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామున 4 గంటలకే ప్రజలకు క్యూలైన్‌లో బారు తీరారు. టిడిడి వారు భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారు దర్శనమయ్యేల క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు.

'ఆదరణ'కు ఉత్తమ యువజన సంఘం అవార్డు

కడప అర్బన్ : 2021- 2022 సంవత్సరానికి జిల్లాలో అన్నివిభాగాలలో ఉత్తమ సేవలు అందించిన ప్రొద్దుటూరు ప్రాంతంకు చెందిన ఆధరణ సోషల్ సర్వీస్ సొసైటీకి ఉత్తమ యువజన సంఘం అవార్డు ఇవ్వనున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి కె.మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ అదేశాలమేరకు ఎంపిక కమిటీ ద్వారా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలు రాష్ట్రీయ స్థాయి పోటీలకు అర్హులన్నారు. జిల్లా ఉత్తమ సంఘం అవార్డును ఈనెల 12న జాతీయ యువజనోత్సవ రోజున ఆధరణ సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు సత్యనారాయణకు ఉత్తమ యువజన సంఘం అవార్డు ప్రదానం చేస్తునట్లు పేర్కొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న సిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్



ఇదేమి కర్మ కార్యక్రమంలో టిడిపి నాయకులు

రాష్ట్ర ప్రజలు అభివృద్ధి చెంద కూడదనే ఆలోచనతో సీఎం జగన్మోహన్ రెడ్డి మోసం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ కడప అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్‌బాబు, సీనియర్ నాయకులు జి. లక్ష్మిరెడ్డి తెలిపారు. సోమ వారం క్లస్టర్ పరిధిలోని ఇదేంఖర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమం 11వ డివిజన్‌లో క్లస్టర్ ఇన్‌ఛార్జి ఆమూరి బాలదాసు పర్యవేక్షణలో డివిజన్ ఇన్‌ఛార్జి దేరంగుల శివ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసిపికి ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గర పడ్డాయని తెలిపారు. 30 సంవత్స రాలుగా వస్తున్న వయోవృత్తుల పింఛన్లు రద్దు చేసి లబ్ధిదారులకు తీరని అన్యాయం చేశారని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు సభలకు లక్షలాది మంది ప్రజలు పాల్గొనడం చూసి ఓర్వలేక చివరకు చంపించే పరిస్థితి కల్పి స్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. **పోరుమామిళ్ల :** టిడిపి మండల అధ్య క్షులు నగిరి భైవరప్రసాద్, సర్పంచ్ యనమల సుధాకర్ ఆధ్వర్యంలో పట్టణం లోని కాపువీధి,ఇ రామాయణపు వీధుల్లో ఇదేమి ఖర్మ రాష్ట్రానికి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్య క్రమంలో టిడిపి మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు రామ సుబ్బారావు, మాజీ ఎంపిటిసి, లేతు మిషన్ షరీఫ్, శ్రీశైలం బోర్డు మాజీ సభ్యులు సీత వెంకటసుబ్బయ్య, మాజీ ఎంపిటిసిలు హిమాం హుస్సేన్, సెట్టెం ప్రతాప్, టిడిపి పట్టణ అధ్యక్షుడు మ స్తాన్, ప్రొఫెసర్ బాష, మాజీ సర్పంచ్ ఎస్.ఎం.బాషా, టిడిపి నాయకులు అతి కారి రాజా, తోట బ్రహ్మయ్య, తోట జనార్ధన్, డ్రైవర్ మాబాష పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

పోరుమామిళ్ల టౌన్ : టిడిపి చేసే అసత్య ప్రచారాలు నమ్మొద్దని ఎపి పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు పి. నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పులివీడు గ్రామసచివాలయాన్ని ఆయన సందర్శించారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, సర్వేయర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నా అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని చెప్పారు. సచివాలయంలో పది మందికి కొత్త పింఛన్లను మంజూరు చేశారు. కొన్ని చోట్ల సాంకేతిక కారణాల వల్ల పింఛన్లు పంపిణీ చేయలేకపోయామని, దీంతో టిడిపి అసత్య ప్రచారాలు చేయడం తగదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పులివీడు గ్రామ పంచాయతీ సర్పంచ్ రఘునాధరెడ్డి బాబు, రాళ్లపల్లి నరసింహులు, గురవయ్య, మస్తాన్ పాల్గొన్నారు.

పనిముట్లు పంపిణీ

కడప అర్బన్ : సాయిబాబా నగర్ భవన నిర్మాణ కార్మికులకు సోమవారం శాంతి సేవా సొసైటీ సభ్యులు రాజమోహన్, రమేష్‌బాబు ఆధ్వర్యంలో పనిముట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సర సందర్భంగా అందరూ గ్రీటింగులు, ఫ్లవర్ బొకేలను శాలువలు ఇస్తూ శుభాకాంక్షలు తెలుపుతూ ఉంటారని, దానికి భిన్నంగా కీర్తి శేషులు అయ్యోరి ధర్మయ్య జ్ఞాపకార్ధంగా శాంతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో జీవనోపాధికి ఉపయోగపడే విలువైన పనిముట్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

హజ్ హౌస్‌కు కేర్ టేకర్‌ను నియమించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



హజ్ హౌస్ దుస్థితిని కలెక్టర్‌కు వివరిస్తున్న సలావుద్దీన్

హజ్ హౌస్‌ను అసాంఘిక కార్యకలాపాల నుంచి కాపా డి పరిసరాలు శుభ్రపరిచి విని యోగం లోకి తేవాలని, కేర్ టేకర్‌ను నియమించాలని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ కోరారు. సోమవారం స్పందనలో కలెక్టర్ విజయ రామరాజుకు వినతిపత్రం అందజేశారు. కరోనా కష్టకాలంలో కోవిడ్ సెంటర్‌గా ఉపయోగపడిన హజ్ హౌస్‌ను ఇంతవరకు పట్టించుకోకపోవడం బాధాకరమని తెలిపారు. హజ్ హౌస్ నలువైపులా పిచ్చి మొక్కలు, కంపచెట్లతో దారుణంగా ఉందని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు, విషపురుగులకు అడ్డగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.30 కోట్ల ప్రజాధనం దుర్వి నియోగం కాకుండా, ముస్లిం మైనార్టీల మనోభావాలకు భంగం కలగకుండా హౌస్‌ను శుభ్రపరచాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ హజ్ హౌస్ పరిసరాలు శుభ్రపరిచి పిచ్చి మొక్కలు తొలగించాలని మైనార్టీ వెల్ఫేర్ అధి.కారులకు సిఫారసు చేశారు. పరిసరాల పరిశుభ్రతకు బడ్జెట్ కేటాయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎం కార్యాలయం నుంచి వెంటనే ఫైల్ పంపించమని ఫోన్ చేశారు. సిఎం దృష్టికి వెంటనే తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. బడ్జెట్ వచ్చేందుకుచర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

అన్నదానం గొప్పది



అన్నదానం చేస్తున్న దాతలు

కాశినాయన: అన్న దానం గొప్పదని వైసిపి మండల కన్వీనర్ విశ్వ నాధరెడ్డి, జడ్‌పిటిసి సత్య నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమ వారం నీలకంఠేశ్వర స్వామి దేవస్థానం ట్రస్టు ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా బాలాయపల్లె వరికుంట్ల గ్రామాల మధ్య రోడ్డు పక్కన ఒక విశాలమైన ప్రదేశంలో నిత్య అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉచిత అన్నదాన కార్యక్రమం ప్రారంభించి వారు మాట్లాడారు. ఎక్క డైనా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు చేయడం మంచి శుభ పరిణా మం అని పేర్కొన్నారు. తమ వంతు సహకారం కూడా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు కొండా రాఘవరెడ్డి, కొండరాజుపల్లి, కోడిగుడ్లపాడు సర్పంచులు గురుబ్రహ్మం, గురవయ్య, ప్రభాకర్ రెడ్డి, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు

అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

కడప : అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశించారు .సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. డిఆర్ఒ గంగాధర్ గౌడ్, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు యదుభూషన్ రెడ్డి, పెద్దిరాజు , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామమోహన్, నరసింహులు, చంద్రమోహన్ హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. కడప నగరం రామాంజనేయపురానికి చెందిన సుహాసిని తనకు ఇంటిపట్టా మంజూరు చేయాలని కోరారు. తన ఆధార్ నంబర్ ప్రొద్దుటూరులోని మరో వ్యక్తి అసెస్మెంట్ నంబర్‌తో లింక్ అయిందని తొలగించాలని కడపకు చెందని వెంకటసుబ్బయ్య విజ్ఞప్తి చేశారు.

నష్టపోయిన రైతులకు పరిహారం

ప్రజాశక్తి - ఖాజీపేట

ఈ ఏడాది అకాల వర్షాలతో దిగుబడులు ఒక్కో చోట ఒక్కో రకంగా వచ్చిందని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందేలా చర్యలు తీసుకుంటుందని వ్యవసాయాధికారులు తెలిపారు. మండల పరిధిలోని నాగసానిపల్లె రెవెన్యూ పొలాల్లో సోమవారం వ్యవసాయశాఖ అధికారులు వరిలో పంట కోత ప్రయోగాలు చేపట్టారు. ఎఒ నాగార్జున, సచివాలయ వ్యవసాయ సహాయ అధికారి సురేంద్ర, బీమా సంస్థ ప్రతినిధి ప్రదీప్ పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. పంట నష్టాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని అధికారులు పేర్కొన్నారు.



వరిలో చేపట్టిన పంట కోత ప్రయోగాలు

ఐసిడిఎస్ సూపర్‌వైజర్లుగా ఉమారాణి, ప్రవీణ

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సంబంధించి ముద్దనూరు, యామవరం గ్రామ సెక్టార్లలోని అంగన్వాడీ కేంద్రాలకు ఉన్నతాధికారులు ఇద్దరు సూపర్‌వైజర్లను నియమించారు. ఆ మేరకు వారు సోమవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ ముంతాజ్ బేగం ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించారు. ముద్దనూరు సెక్టార్ గ్రేడ్-2 సూపర్‌వైజర్గా ఉమారాణి, యామవరం సెక్టార్ గ్రేడ్-2 సూపర్‌వైజర్గా ప్రవీణ నియమితులయ్యారు. ఉమారాణి నంద్యాల జిల్లా నందికొట్కూరు ప్రాజెక్టు పరిధిలోని పాములపాడు మండలంలో అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ప్రవీణ ప్రొద్దుటూరు అర్బన్‌లో కార్యకర్తగా విధులు నిర్వహిస్తూ పదోన్నతితో మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలు, గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్‌టియు కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎస్‌టియు కేలండర్‌ను సోమవారం తహశీల్దార్ పి.రమణారెడ్డి ఆవిష్కరించారు. ఎస్‌టియు మండల శాఖ అధ్యక్షుడు జి.రామమోహన్, ప్రధాన కార్యదర్శి పి.ఓబన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్‌టియు కడప డివిజన్ కో-కన్వీనర్ ఎస్.కరిముల్లా, జిల్లా కౌన్సిలర్లు శ్రీనివాసులు, వీర ప్రతాప్, మండల మహిళా కన్వీనర్ సి.పద్మ, సిపిఎస్ కన్వీనర్ ఎస్.సుమన్, మండల యూనియన్ నాయకులు జి.వెంకటసుబ్బారెడ్డి, జి.సుబ్బారెడ్డి, నాగరాజు, విజయకుమార్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ప్రతి ఏడాదీ చేతనైన సాయం చేస్తాం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక వృద్ధాశ్రమంలో మానసిక వికలాంగులకు, వృద్ధులకు టిడిపి పట్టణ మాజీ అధ్యక్షులు మద్దూరు వెంకటరామిరెడ్డి తన పెద్ద కుమార్తె రాధా కుమారి, అల్లుడు జయ చంద్రారెడ్డి వివాహ వార్షికోత్సవ సందర్భంగా అన్న దానం చేశారు. మరికొన్ని వస్తువులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఇదే రోజు చేతనైన సాయం చేస్తుంటామని తెలిపారు.




ఆశ్రమంలో వెంకటరామిరెడ్డి, కుటుంబ సభ్యులు

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

వైసిపి ప్రభుత్వంలో అర్హతగల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బి.కొత్తపల్లి గ్రామ సచివాలయంలో సోమవారం కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచు సుబ్బమ్మ, పంచాయతీ కన్వీనర్ జి.నాగిరెడ్డి, గ్రామాలపల్లె రామ సుబ్బారెడ్డి, కొండా లక్ష్మీదేవి లబ్ధిదారులకు అంద జేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ బి.కొత్తపల్లి పంచాయతీలో ఇంతకు మునుపు 285 పింఛన్లు ఉండేవని, ఇందులో ఏఒక్కటి కూడా తొలగించలేదన్నారు. కొత్తగా 11 పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.



పింఛను అందజేస్తున్న సర్పంచు సుబ్బమ్మ, నాగిరెడ్డి

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - మైదుకూరు

మండలంలోని లెక్కలవారిపల్లె గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు లెక్కల శ్రీనివాసులరెడ్డి (55) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాసులరెడ్డి కడపలో నివాసం ఉంటున్నారు. చిట్వేలి మండలం నాగవరంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు రైలు ఎక్కేందుకు బైక్‌పై వెళుతుండగా అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి, బైక్ నుంచి కింద పడి మృతి చెందారు. తోటి ఉపాధ్యాయులు రైలు సమయం అవుతున్నా రాలేదని గుర్తించి ఫోన్ చేయగా, ఆయన చనిపోయిన విషయం తెలిసింది. వెంటనే వారు ఆయన బంధువులకు సమాచారమిచ్చారు.



లెక్కల శ్రీనివాసులరెడ్డి (ఫైల్ ఫోటో)

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

- తల్లి, తమ్ముడికి గాయాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పట్టణ పరిధిలోని శ్రీనివాసనగర్‌కు చెందిన షేక్ అర్షద్ (20) అను విద్యార్థి ఆదివారం రాత్రి పొద్దుపోయాక విద్యుదాఘాతంతో మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి.. అర్షద్ తండ్రి మౌలాలి తన కుటుంబంతో రెండస్తుల భవనంలో ఉంటున్నారు. ఇంటిపై ఆరేసిన దుస్తులు తీసేందుకని అర్షద్ పైఅంతస్తులోకి వెళ్లాడు. ఈ క్రమంలో అతని తల్లి దిల్షాద్ కింద నుంచి ఇనుప పైప్ అందించగా అది విద్యుత్‌తీగలకు తగిలింది. విద్యుత్ సరఫరా కావడంతో అర్షద్‌తోపాటు తల్లి, తమ్ముడు మహీర్ విద్యుత్ షాకానికి గురయ్యారు. వెంటనే ముగ్గురిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అర్షద్ అప్పటికే మృతి చెందాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో గాయపడిన ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరికి ఎలాంటి ప్రాణాపాయంలేదని సోమవారం సాయంత్రం పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు....

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని పొట్లదుర్తి గ్రామానికి చెందిన వీరబోయిన ఉగ్ర నరసింహ (27) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై చిలంకూరు గ్రామం నుండి పొట్లదుర్తి గ్రామానికి బైక్‌పై వస్తుండగా రోడ్డు ప్రమాదంలో చోటు చేసుకుంది. పంది అడ్డు రావడంతో దానిని తప్పించబోయి కింద పడ్డాడు. తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందాడు. మృతుని అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మంజునాథరెడ్డి తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కుటుంబ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలను అందించాలని జమ్మలమడుగు డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ పేర్కొన్నారు. కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చెన్నమ్మరాజుపల్లెలో సోమవారం కుటుంబ డాక్టర్ విధానం ద్వారా అందిస్తున్న వైద్య, ఆరోగ్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. కుటుంబ డాక్టర్ విధానం ద్వారా 67 రకాల మందులను 14 రకాల పరీక్షలను ఉచితంగా అందిచాలన్నారు. గ్రామంలో ఉన్న బిపి, షుగర్, ఆస్తమా, రక్తహీనత, గుండె జబ్బులు, చిన్న చిన్న వ్యాధి గ్రస్తులు, గర్భిణులు, బాలింతలకు అందరికీ వైద్యం అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. గర్భిణులు, హైరిస్క్ గర్భిణులపై ఎక్కువ ప్రాధాన్యత చూపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలను చైతన్య పరచాలని కోరారు. వైద్యాధికారి హనీఫ్ బాబాతో ఇంత వరకు సాధించిన ప్రగతి నివేదిక తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 104 డాక్టర్ సుబ్రమణ్యం, సూపర్‌వైజర్ వరప్రసాద్, చంద్రకళ, ఆరోగ్య కార్యకర్త యశోద, సుబ్బయ్య, నాగ సుహాషిణి, ఆషా కార్యకర్త బిందు పాల్గొన్నారు.



104 సిబ్బందితో మాట్లాడుతూన్న డిప్యూటీ డిఎంహెచ్ఒ శాంతికళ

పేదల సంక్షేమమే ధ్యేయం



పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తుందని వైసిపి పురపాలక ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, పురపాలక చైర్మన్ వల్లెపు వరప్రసాద్ తెలిపారు. వైఎస్ఆర్ పింఛను కానుక కార్యక్రమంలో భాగంగా సోమవారం పెద్ద కొండప్ప కాలనీ, వెంకటాపురం సచివాలయం పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను వారు కౌన్సిలర్లతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులు సిఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, కొంగనపల్లి కొండలరావు, ఎ.విజయ్‌కుమార్ నాయుడు, కో-ఆప్షన్ చంద్రమౌళి, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

171 కొత్త పింఛన్లు మంజూరు : ఎంపిపి

చాపాడు : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, అందులో భాగంగానే మండలానికి జనవరి నుంచి 171 కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఎంపిపి టి. లక్షుమయ్య తెలిపారు. మండలంలోని అల్లాడుపల్లె గ్రామంలో సోమవారం కొత్తగా మంజూరైన రూ.2,750లు పెరిగిన పింఛన్ల డబ్బులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని సిఎం జగన్ నెరవేర్చారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, సర్పంచు కిషోర్‌కుమార్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్, పంచాయతీ కార్యదర్శి చంద్ర శేఖర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మందుల పిచికారితో పూతను కాపాడుకోవాలి

వేంపల్లె : మామిడి చెట్లుకు వచ్చిన పూత రాలి పోకుండా అధికారుల సూచన మేరకు మందులను పిచికారి చేసుకోవాలని ఉద్యాన అధికారి రెడ్డయ్య తెలిపారు. మండలంలోని అలిరెడ్డిపల్లె గ్రామంలో సాగు చేసిన మామిడి తోటలను సోమవారం ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం అలిరెడ్డిపల్లె రైతు భరోసా కేంద్రంలో మామిడి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. మామిడి చెట్లుకు పూత వచ్చే దశలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చీడ పురుగులు సోకిన వెంటనే అధికారుల దృష్టికి తెస్తే వాటి నివారణకు చర్యలు తీసుకునేందుకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రైతులు పండ్ల తోటల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం అనేక పథకాలు పెట్టడం జరిగిందని అన్నారు. సర్పంచు గాలి నాగరాజు, మార్కెట్ యార్డు డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వైకుంఠ ఏకాదశి సందర్భంగా పులివెందుల మునిసిపాలిటీ పరిధిలో ఉన్న ఉలిమెళ్లలో శ్రీశ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి సన్నిధిలో వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజలో పాల్గొని, ఏర్పాటు చేసిన ఎడ్ల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, ఉలిమెళ్ళ గ్రామ పెద్దలు శంకర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, నీలకంఠరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ పద్మావతి శ్రీనివాస రెడ్డి, పార్నపల్లి కిషోర్ పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామి వారి కళ్యాణ అనంతరం 2000 మందికి అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సిఐ రాజు, ఎస్ఐ చిరంజీవి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయాల చైర్మన్లు, సుధీకర్‌రెడ్డి, బ్యాటరీ ప్రసాద్, యర్ర వెంకటసుబ్బయ్య, అర్చకులు రాజేష్‌శర్మ, ఎఎస్ఐ స్వామి, హెడ్ కానిస్టేబుళ్లు రాము గోవిందు, చంద్రశేఖర్‌రెడ్డి, కానిస్టేబుల్ మహేష్ పాల్గొన్నారు.

వేంపల్లె : ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి, ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు బారులుతీరారు. ఆలయ నిర్వాహకులు, అధికారులు ఉత్తర ద్వార దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శ్రీ వాసవి మాతా కన్యకాపరమేశ్వరి విగ్రహాన్ని ఊరేగించారు. శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎంపిపి లక్ష్మి గాయత్రి, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కురాకుల వెంకటేష్, ఆలయ ఇఒ శ్రీధర్, ఆలయ సిబ్బంది దాసిరెడ్డి, అర్చకులు హరిప్రవీణ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి, చియ్యపాడు శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చియ్యపాడు పూజలో కాత్యాయనీ కన్‌స్ట్రక్షన్ ఎండి పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి కుటుంబ సభ్యులు, ఆలయ చైర్మన్ మహానందిగారి నిరంజన్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. వడ్ల రాంప్రసాద్ ఆచారి, చియ్యపాడు దేవస్థాన అర్చకులు బి.సుదర్శనాచార్యులు, గ్రామ ప్రజలు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అల్లాడుపల్లెలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

ఖోఖో పోటీల్లో 'వేదవ్యాస' విద్యార్థుల ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తమ కళాశాల విద్యార్థులు పలు పోటీల్లో పాల్గొంటూ తమ సత్తా చాటుతున్నారని వేదవ్యాస కళాశాల కరస్పాండెంట్ లింగారెడ్డి నాగేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని శ్రీ వేదవ్యాస డిగ్రీ కళాశాలలో సోమవారం ఆయన మాట్లాడుతూ యోగివేమన విశ్వవిద్యాలయం నిర్వహించిన అంతర్ కళాశాలల ఖోఖో మహిళా విభాగం పోటీల్లో బంగారు పతకాలు సాధించి, అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థులు షిరీష, నాగనవీణ, హరిచందన, ధనలక్ష్మి, పురందరేశ్వరి, ప్రవల్లిక, పావని, లలిత, సుచరిత, వైష్ణవి, నాగలక్ష్మి, తస్లీమ్, అమృతతవర్షిణి, కరిష్మా బంగారు పతకాలతోపాటు సర్టిఫికేట్లు, రూ.5 వేలు నగదు బహుమతి సాధించారన్నారు. అంతర్ యూనివర్శిటీ స్థాయిలో జరిగే పోటీలకు షిరీష, నాగనవీణ, హరిచందన, ధనలక్ష్మి ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు జి.సుదర్శనరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ రామలక్ష్మిరెడ్డి, నాగరాజు, అధ్యాపకులు విజేతలను అభినందించారు.

ఖేల్ ఖుద్ పోటీల్లో ..

పులివెందుల రూరల్ : స్థానిక శ్రీ సరస్వతి విద్యామందిరం విద్యార్థులు ఇటీవల హిందూపురంలో జరిగిన ఖేల్‌ఖుద్ పోటీల్లో క్యారం బోర్డ్ పోటీల్లో తమ ప్రతిభ చూపి మొదటి బహుమతిని సాధించారని ఆ పాఠశాల ప్రధానాచార్యులు రాజ్యలక్ష్మి తెలిపారు. గెలిచిన విద్యార్థులకు షీల్డ్ ప్రదానం చేశారన్నారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల అధ్యక్షులు రామ చంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటారామిరెడ్డి, కార్యదర్శి సంభూరెడ్డి, కోచ్ షాహిదా పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ ఫలితాల్లో సిబిఐటి..

చాపాడు : జెయన్‌టియు అనంతపురం వారు విడుదల చేసిన ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం మొదట సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక సిబిఐటి కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి ఉత్తమ ఫలితాలు సాధించారు. సియస్ఇ విభాగానికి చెందిన బి.చైతన్య శ్రీ 90.56శాతం, యస్.శరణ్యారెడ్డి 89.44శాతం, కె.సాజిదా 88.56, ఇసిఇ విభాగానికి చెందిన బి.సాయిరోహిత్ 89.67, యస్.నూర్ మహమ్మద్ 89.44, వి.గ్రీష్మ 89.22, ఇఇఇ విభాగానికి చెందిన కె.మహాలక్ష్మి 87.78, యం.వాసవి 85.33శాతం, యం.లావణ్య 83.89శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, డైరెక్టర్ వి.లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసుల రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం హర్షం వ్యక్తం చేశారు.

నెమళ్ల పునరుత్పత్తి కేంద్రంపై దృష్టి పెట్టండి



నెమళ్ల పునరుత్పత్తి కేంద్రాన్ని పరిశీలిస్తున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఇడుపులపాయలో ఉన్న నెమళ్ల పునరుత్పత్తి కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. ఇడుపులపాయలోని నెమళ్ళ పునరుత్పత్తి కేంద్రాన్ని సోమవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇడుపులపాయలో నెమళ్ళ పునరుత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ నెమళ్ళ పునరుత్పత్తి కేంద్రం కాంగ్రెస్ హయాంలో ఎంతో అభివృద్ధి చెందడంతోపాటు నిత్యం సందర్శకులతో పండుగ వాతావరణంగా ఉండేదన్నారు. అనంతరం వచ్చిన తెలుగుదేశం, వైసిపి ప్రభుత్వాలు ఈ పునరుత్పత్తి కేంద్రానికి నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేశాయన్నారు. ప్రస్తుతం ఉన్న నెమళ్లకు కూడా రక్షణ లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉత్తన్న, అమర్, వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బాలస్వామిరెడ్డిని పరామర్శించిన తులసిరెడ్డి

అలవలపాడు గ్రామానికి చెందిన మాజీ గ్రంథాలయ చైర్మన్, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డిని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పరామర్శించారు. బాలస్వామిరెడ్డి మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్నారు.

అనాథలకు అండగా ఉంటాం

మైలవరం : ఆశ్రమాల్లో ఉండే అనాథ పిల్లలు, వృద్ధులకు అండగా ఉంటామని జంగాల మునుస్వామి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రాజా ఫౌండేషన్‌ను సోమవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఫౌండేషన్‌లోని 60 మంది వృద్ధులు, అనాథ పిల్లలతో కేక్ కట్ చేయించి, వారికి పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. వారి యోగక్షేమాలను విచారించారు. మహాజన సోషలిస్టు పార్టీ సీనియర్ నాయకులు కోట సుబ్బయ్య, పాపోడు, రాజశేఖర్, ముద్దనూరు హరికృష్ణ పాల్గొన్నారు.

యువతలో చైతన్యం తేవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జమ్మలమడుగు

యువతలో చైతన్యం తేవాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ)-2023 కెలండర్‌ను ఆయన సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముందుగా నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లాలో మంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు అభినందిస్తున్నానని తెలిపారు. సిఎం జగన్ కూడా యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. అందరి సహకారంతో కొత్త ఏడాది ముందుకు సాగాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడ్ని కోరుతున్నానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, నాయకులు ఆదాము, ప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.



డివైఎఫ్ఐ కెలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎంవిఐగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



పులివెందుల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవిఐ)గా బి.వెంకటప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనుగొండలో అసిస్టెంట్ ఎంవిఐగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చానని తెలిపారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. రికార్డులు కూడా పక్కాగా ఉండాలని సూచించారు. ఫిట్మెంట్ లేకుండా వాహనం నడిపితే చర్యలు తప్పవని తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న వై.ప్రసాద్ కడప ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ అయ్యారు.

విద్య, వైద్యం, వ్యవసాయంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేకదృష్టి పెట్టారని వైసిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. పాడా నిధుల ద్వారా రంగనాథస్వామి గుడి ప్రాంగణంలో వైఎస్ఆర్ వాటర్ ప్లాంట్‌ను వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పులివెందుల ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి ఎన్నో నిధులిచ్చారని తెలిపారు. పులివెందుల నియోజకవర్గం అదర్శవంతంగా ఉండేదుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయాల చైర్మన్లు, సుధీకర్‌రెడ్డి, బ్యాటరీ ప్రసాద్, యర్ర వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పింఛన్లు తొలగించడం సబబుకాదు

ప్రజాశక్తి - మైదుకూరు

గ్రామ, వార్డు సచివాలయాల ఒక్కో పరిధిలో 25నుంచి 30 పింఛన్లు తొలగించడం సబబు కాదని టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమ వారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రభుత్వ ఉద్యోగస్తులకు జీతాలు ఇవ్వలేని స్థాయికి వైసిపి ప్రభుత్వం దిగజారిందని విమర్శించారు. రాష్ట్ర ఆర్థికస్థితిపై అనుమానం కలుగుతోందన్నారు. ఈ ప్రభుత్వంలో దౌర్జన్యాలు, అవినీతి పెరిగి పోయిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాల వల్లే చంద్రబాబు సభలకు విపరీతమైన జనాలు వస్తున్నారని తెలిపారు. ఇది ఓర్వలేకనే చంద్రబాబుపై బురదజల్లే కార్యక్రమం మొదలుపెట్టారని విమర్శించారు. కందుకూరు, గుంటూరులో జరిగిన ఘటనలకు పోలీసుల వైఫల్యమే కారణమని తెలిపారు. లోకేష్ సభకు జనాలు స్వచ్ఛందంగా వస్తారని, వారికి ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులదేనని తెలిపారు. ఖాజీపేట మండలం నాగసాని పల్లె దగ్గర శోత్రియం భూమిని ఆక్రమించుకున్న ఘనత శెట్టిపల్లి రఘురామిరెడ్డిదేనని ఆరోపించారు. టిడిపి పట్టణ అధ్య క్షులు దాసరి బాబు, ధనపాల జగన్, ధనపాల రవి. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పుట్టా సుధాకర్‌యాదవ్

'పుట్టా'కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఖాజీపేట : మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్‌కు మండల టిడిపి నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మైదుకూరులోని పార్టీ కార్యాలయంలో వారు సోమవారం కలిశారు. సర్వర్‌ఖాన్‌పేటకు చెందిన కడప పార్లమెంటు తెలుగుదేశం పార్టీ మైనారిటీ ప్రధాన కార్యదర్శి జెండాల మహబూబ్ బాషా పుట్టాకు పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో జెండాల ఫజులర్ రహిమాన్ పాల్గొన్నారు.

మెడల్ సాధించిన విద్యార్థులకు సత్కారం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : డిసెంబర్ నెలలో జరిగిన అంతర్జాతీయ తేక్వాండో పోటీల్లో శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు సిల్వర్ మెడల్స్, గోల్డ్ మెడల్స్ సాధించడం చాలా సంతోషంగా ఉందని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ చైర్మన్ ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం విద్యార్థులను శాలువాలతో సత్కరించారు. డాక్టర్ వరుణ్ కుమార్ విద్యార్థులను అభినందించారు. కరస్పాండెంట్ అరకట వేముల హరినారాయణ, కళాశాల కో-ఆర్డినేటర్ గౌరీ శంకర్, సలీం తేక్వాండో మాస్టర్ శ్రీనివాసులు విద్యార్థుల భవిష్యత్‌కు ప్రోత్సాహం అంది స్తామమన్నారు.